www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 30 డిసెంబర్ 2023

5

తూర్పుగోదావరి



గోపాలపురం పిఎస్‌కు పురస్కారం



అవార్డును అందుకుంటున్న ఎస్ఐ

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు బెస్ట్ అవార్డు వచ్చిందని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేకాట, కోడిపందాలు, అక్రమ మద్యం వంటి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపామని, ప్రమాదకర ప్రదేశాలు గుర్తించి తగిన చర్యలు తీసుకుని రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. అవార్డును జిల్లా ఎస్‌పి పి.జగదీష్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ అవార్డు రావడంపై సిఐ అనసూరి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

నూతనోత్సాహంతో కదన రంగంలోకి...



▸ ముగిసిన ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ ▸ భారీ ప్రదర్శన, బహిరంగ సభ

రాష్ట్ర మహాసభ నింపిన స్ఫూర్తితో నూతనోత్సాహంతో ఎస్ఎఫ్ఐ నాయకులు కదనరంగంలోకి వెళ్తున్నారు. భవిష్యత్ కర్తవ్యాలను నిర్ణయించుకుని విద్యారంగం పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధమయ్యారు. కాకినాడలో మూడు రోజులు పాటు జరిగిన మహాసభ శుక్రవారం బహిరంగ సభతో ముగిసింది. చివరి రోజు అఖిలభారత నాయకుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. చివరి రోజు నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడలో మూడు రోజులు పాటు ఉత్సాహంగా జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజున ఎస్ఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షుడు ఎస్‌పి.సాను మాట్లాడారు. దేశంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కేంద్రలో బిజెపి సర్కారు విద్యారంగంపై చేస్తున్న దాడిని, కాషాయీకరణ జరుగుతున్న విధానాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై ఉద్యమించాల్సిన అవసరాన్ని తెలిపారు. జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షురాలు ఐషీఘోష్ దేశంలో ప్రస్తుతం విద్యావ్యవస్థ ఛిన్నాభిన్నంగా మారిన విధానాన్ని వివరించారు. మోడీ సర్కార్ వచ్చిన తరువాత విద్యారంగంలో వినాశకర మార్పులు వచ్చాయన్నారు. చరిత్రను మార్చి రాయడం వంటి చర్యలను వివరించారు. సమాజం ప్రమాదంలో పడిందని దీన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతన విద్యార్థులపైనే ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిరంతరం విద్యారంగ సమస్యలపై పనిచేయడమే కాకుండా మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. యువత పెడదోవ పట్టకుండా ఉండాలంటే సమాజంలో అన్ని అంశాలపై ఎడ్యుకేట్ చేయాల్సిన అవసరాన్ని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, విద్యారంగ సమస్యలను విద్యార్థుల్లోకి తీసుకువెళ్లి వ్యతిరేకించేలా పనిచేయాలని సూచించారు.


ఉద్యమ స్ఫూర్తిని నింపిన నాయకుల ప్రసంగాలు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ సందర్భంగా పలువురు నాయకుల ప్రసంగాలు ఉద్యమ స్ఫూర్తిని నింపాయి. ఈ మహాసభలో తొలిరోజు పిడిఎఫ్ మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బిజెపి సర్కారు అవలంబిస్తున్న విద్య వినాశకర విధానాలను వివరించారు. ఎయిడెడ్ విద్యావ్యవస్థ నిర్వీర్యమైన క్రమాన్ని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవశ్యకతను వివరించారు. కేరళలో అమలవుతున్న ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని తెలియజేవారు. విద్యాసంస్థల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ విధానాలను, ఫలితంగా ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమవుతున్న తీరును వివరించారు. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరాన్ని వివరించారు. రెండో రోజు పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు హాజరై మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ నాయకుల నడవడిక ఎలా ఉండాలనే దానిపైన సూచనలు చేశారు. విద్యారంగంలో ప్రయివేటీకరణ విధానాలు, ప్రయివేటు యూనవర్శిటీలు పెరుగుదల వల్ల కలిగిన నష్టాలను వివరించారు. మరో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూఈ ఏడాది చాలామంది విద్యార్థులు నూతనంగా ఎస్ఎఫ్ఐలోకి రావడం అభినందనీయమన్నారు. వారు గత వ్యక్తిగత నడవడిక, పద్ధతులను పూర్తి స్థాయిలో మార్చుకొని విద్యా సమస్యలు, విద్యార్థుల సమస్యలు, సమాజంలో జరిగే ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాటం చేయగలిగే పోరాట పటిమను అలవాటు చేసుకోవాలన్నారు. అలాగే పలువురు మాజీ నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులు హాజరై సౌహార్ద సందేశాలను ఇచ్చారు. ఆయా రంగాల్లో నెలకొన్న సమస్యలు, ఐక్య ఉద్యమాల ఆవశ్యకతను వివరించారు. మూడు రోజులుగా ఉత్సాహంగా సాగిన మహాసభలో నాయకులు వారివారి జిల్లాల రిపోర్టులను, ఉద్యమంలో సాధించిన విజయాలను వివరించారు. భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుని సొంత జిల్లాలకు పయనమయ్యారు.



అందరి సహకారంతో మహాసభ విజయవంతం

అందరి సహకారంతో ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ జయప్రదమైందని, సహకారాలు అందించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.సూరిబాబు అన్నారు. ఏర్పాట్లపై ఆహ్వాన సంఘం తరపున సూరిబాబు మాట్లాడారు. 30 రోజులు వ్యవధిలోనే రాష్ట్ర మహాసభలకు ఏర్పాట్లు చేశామన్నారు. పలువురు విద్యార్థులు వాలంటీర్లుగా మహాసభలు విజయవంతానికి కష్టపడి పని చేశారన్నారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు అందించిన సాయం మరువలేనిదన్నారు. జెఎన్‌టియుకె విసి జివిఆర్ ప్రసాదరాజు, ఇతర పెద్దలు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



భగత్‌సింగ్ చిత్రపటంతో విద్యార్థి



ఐక్యతను చాటుతూ...



డైరీ ఆవిష్కరణ



హాజరైన విద్యార్థులు



నల్ల దుస్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

4వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 4వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా చేపట్టిన రిలే నిరహారదీక్షలో కార్మికులు నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఐదేళ్లగా కార్మికుల డిమాండ్లను తెలియ చేస్తూనే ఉన్నామని చెప్పారు. సమ్మెలోకి వెళ్తున్నామని ముందుగానే నోటీసు ఇచ్చామని, ఆ సమయంలోనే సంఘాలతో చర్చించాల్సిన ప్రభుత్వం సమ్మె ప్రారంభం అయిన తరువాత చర్చలకు పిలిచి సమయం కావాలని అడగడంలో అర్థం లేదన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు మీసాల కిషోర్, మీసాల ప్రేమ్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా మా సమస్యల్ని పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నాదని మండపడ్డారు. తామేమి చట్టా నికి విరుద్ధంగా జీతాలు పెంచాలని, పర్మినెం ట్ చేయాలని కోరడం లేదని, చట్టానికి లోబడే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరు తున్నట్లు చెప్పారు. ఈ కర్యక్రమంలో రాజన్న, అప్పారావు, మాంద్రు సుధీర్, వడ్డాది శ్యామ్, పూజారి వాసు, కారంకి ప్రసాద్, భూపతి రవీంద్ర, మీసాల జ్యోతి, కళ్యాణ్, రాజేష్, ఎం.శకుంతల పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళన

-సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నేతల హెచ్చరిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అంగన్‌వాడీలు, ఎస్ఎస్ఎ, మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే తాము సైతం ప్రత్యక్ష ఆందోళనలో భాగస్వాములం అవుతామనిసిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నేతల హెచ్చరించారు. నగరంలోని శ్యామలా సెంటర్లో శుక్రవారం అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సుందర బాబు, బి.రాజులోవ, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కె.జోజి మాట్లాడారు. గత 18 రోజులుగా అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే ఏమీ తెలియనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు పక్క రాష్ట్రం కంటే అదనంగా జీతాలు ఇస్తానని చెప్పి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను విస్మరించడం జగన్మోహన్ రెడ్డికి తగదన్నారు. నాడు అంగన్‌వాడీలను అక్కా చెల్లెమ్మలంటూ పలుకరించిన జగన్ నేడు వారిని శత్రువులుగా చూస్తున్నారని మండి పడ్డారు. శాంతి యు తంగా సమ్మె చేస్తు న్న అంగన్‌వాడీలను మరింతగా రెచ్చగొట్టేలా సెంటర్ల తాళాలను పగలగొట్టించి ప్రభుత్వమే అలజడిని సృష్టించేలా చేసిందన్నారు. ఇటువంటి దిక్కు మాలిన చర్యలు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రమే చేసిందని, గతంలో దేశంలో ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. రాష్ట్రంలో 25 వేల మంది ఎస్ఎస్‌సి ఉద్యోగులు, సుమారు 40 వేల మంది మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ఉలుకు పలుకు లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శంచారు. ఇదే తీరుతో ప్రభుత్వం ముందుకు వెళ్లితే రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యాక్షులు ఎస్ఎస్ మూర్తి, జిల్లా కోశాధికారి కెఎస్‌వి రామచంద్రరావు, ఆయా యూనియన్ల నాయకులు సప్పరమణ, సిహెచ్.మోహన్ రావు, కొండలరావు, బి. పవన్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్. మాణిక్యాంబ, కర్రి.రామకృష్ణ, సోమేశ్వరరావు పాల్గొన్నారు. .



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ

విద్యాదీవెనకు రూ.19.55 కోట్లు జమ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


జిల్లాలో విద్యా దీవెన పథకంలో 26,682 విద్యార్థులకు సంబంధించి వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.19.55 కోట్లను జమ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి విద్యా దీవెన కార్యక్రమంలో సిఎం జగన్మోహన్ రెడ్డి పాల్గొని బటన్ నొక్కి విద్యార్థుల తల్లులు ఖాతాలకు నగదును జమ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని సంబంధిత విద్యార్థులకు చెక్‌ను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనం పిల్లలకు ఇచ్చే ఆస్తి ఏదైనా ఉందంటే అది విద్య ఒక్కటే అని అన్నారు. సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలపారు. నేటి విద్యార్థులే రేపటి రాష్ట్ర భవిష్యత్తు అని నమ్మి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని వివరించారు. ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే నగదును జమ చేస్తుందన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.సందీప్ మాట్లాడుతూ జిల్లాలో విద్యాదీవెన, వసతి దీవెన పథకాల్లో ఈ ఏడాది ఇప్పటి వరకూ రూ.122.76 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు.



విద్యార్థులకు చెక్కులు అందిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమాధికారిణి కె.జ్యోతి, బిసి వెల్ఫేర్ అధికారి పి.సత్యరమేష్, వివిధ కళాశాల విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

క్లస్టర్ ఇన్‌ఛార్జుల సేవలు అభినందనీయం




క్లస్టర్ ఇన్‌ఛార్జులను సత్కరించిన వెంకట రమణ చౌదరి

ప్రజాశక్తి - సీతానగరం

టిడిపి రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు లో భాగంగా చేపట్టిన బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, కుటుంబ రిజిస్ట్రేషన్ ప్రక్రి య వందశాతం పూర్తి చేసిన క్లస్టర్ ఇన్‌ఛార్జుల సేవలు అభినందనీయమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. శుక్రవారం క్లస్టర్ ఇన్‌ఛార్జులకు సత్కారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గారంటీ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువు కావాలనే ఉద్దేశంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టడం జరిగిందని అన్నారు. దానిలో భాగంగా నియోజకవర్గంలో వందశాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. నియోజకవర్గంలో టిడిపి విజయానికి క్షేత్రస్థాయిలో టిడిపి కార్యకర్తలు కృషిని ఆయన అభినందించారు. రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి కార్యకర్తలు పనిచేయాలని, రిజిస్ట్రేషన్లు ప్రక్రియ పూర్తి చేయని వారు తొందర్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కుటుంబంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందటానికి రిజిస్ట్రేషన్ నమోదు తప్పనిసరిగా చేయాలని అన్నారు. ఎన్నికలను నేపథ్యంలో సమయం తక్కువగా ఉందని, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు.

నీటి తీరువా బకాయిలు చెల్లించాలి



నీటి విడుదలకు స్విచ్‌ను ఆన్ చేస్తున్న వెకంటేశ్వరరావు

ప్రజాశక్తి - తాళ్లపూడి

రైతులు చెల్లించాల్సిన నీటి తీరువా బకాయిలు వెంటనే చెల్లించి ఎత్తిపోతల పథకం ద్వారా మరిన్ని సేవలు అందించేందుకు సహకరించాలని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు సూచించారు. రెండవ పంటకు అవసరమైన సాగునీటిని శుక్రవారం పైడిమెట్ట పథకం నుంచి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఒక ట్రాన్స్‌ఫారం నుంచి రెండు మోటార్ల ద్వారా సుమారు 3,500 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని అన్నారు. రెండవ ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు సుమారు రూ.5 లక్షల వరకూ ఖర్చు అవుతుందనే అంచనాతో ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులతోపాటు ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎత్తిపోతల పథకం డైరెక్టర్ ఇంజరపు మురళి, వైసిపి నాయకులు బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పట్టణ కమిటీ నియామకం


ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణ జనసేన పార్టీ కమిటీని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు నియమించారు. పట్టణ అధ్యక్షులుగా రంగా రమేష్, ఉపాధ్యక్షులుగా బెల్లంకొండ పుష్పవతి, అబ్దుల్ షబ్బీర్, జనరల్ సెక్రెటరీలుగా కొవ్వాడ బాల బాలాజీ (బాలు), నగినబోయిన శివ నాగరాజు, తూరుగోపు సంజీవ సాగర్, చిప్పాటి శివకుమార్, వీరితోపాటు, కార్యదర్శులను, సంయుక్త కార్యదర్శులను నియమించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రంగా రమేష్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు గోవిందరావుకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.



రంగ రమేష్‌ను అభినందిస్తున్న జనసేన కార్యకర్తలు


కార్టూ'నిజం'



మెరుగైన ఆరోగ్య సేవలకు కృషి

ప్రజాశక్తి - గోకవరం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానికంగా రూ.6.50 కోట్లతో నిర్మించిన 50 పడకల ఆసుపత్రిని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ గతంలో 10 పడకల ఆసుపత్రిగా ఉన్న ఆసుపత్రి స్థాయిని వైసిపి ప్రభుత్వం 50 పడకల ఆసుపత్రి స్థాయికి పెంపుదల చేసిందన్నారు. అన్ని రకాల వైద్య సదుపాయాతో ఆసుపత్రి భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. మండలంలోని తంటికొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ తాను పార్టీ మారే ఆలోచన లేదన్నారు. సిఎం జగన్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. రాజీనామాలు చేసిన వాళ్లలో నాకు అనుకూలంగానూ, తోట నరసింహంకు వ్యతిరేకంగా రాజీనామాలు చేశారని చెప్పారు. నాకు అనుకూలంగా రాజీనామాలు చేసి ఉంటే ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి వాళ్లు నాతోనే ఉండేవారన్నారు. గతంలో నా విజయానికి తోట నరసింహం పనిచేశారని, ప్రస్తుత ఎన్నికల్లో టిక్కెట్‌ను ఆయనకు ఇస్తే కలిసి పనిచేస్తానని అన్నారు. కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా అందరినీ కలుపుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి దాసరి శ్రీరంగం, సర్పంచ్ కొమరం శ్రావణి, మండలం వైసిపి కన్వీనర్ పాటి రాంబాబు, వైసిపి నాయకులు వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు, దాసరి రమేష్, దాసరి తమన్నా దొర, కర్రి సూరారెడ్డి, పెనుగొండ సత్యానందం, కర్రి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.




ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చంటిబాబు

ఉపాధి పనుల్లో అవకతవకలు

ప్రజాశక్తి - పెరవలి

గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవక తవకలు ఉండటంపై పిడి జగదాంబ, ఎపిడి అప్పలరాజు అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిపి కార్యాలయంలో శుక్రవారం దిక 2022-2023 సంవత్సరం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత రికార్డులను పరిశీలించి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పనులు వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయకుండా సొమ్ము డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల తీరు సరిగా లేదని, రికార్డులు సైతం సవ్యంగా లేవన్నారు. దీనిపై తదుపరి కార్యచరణ తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అన్నవరప్పాడు గ్రామ సర్పంచ్ పంతం చిన్న, ఉసులుమర్రు గ్రామ వైసిపి అధ్యక్షులు దవులూరి శ్రీనివాస్ ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల నేటికీ బిల్లులు రాలేదని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్.నరేష్, ఎస్ఆర్ పి.తులసి నాయక్, ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్, ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, టిఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.



పిడికి ఫిర్యాదు చేస్తున్న దవులూరి శ్రీనివాస్

జగన్‌కు తగిన గుణపాఠం తప్పదు

-18వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె -సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ హెచ్చరిక

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 18వ రోజుకు చేరింది. జిల్లావ్యాప్తంగా తహశీల్దార్, ఎంపిడిఒ, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద జరుగుతున్న నిరసన శిబిరాల్లో అంగన్‌వాడీలు రిలే నిరాహారదీక్షలను కొనసాగించారు. సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు రిలే నిరాహార దీక్షలు. **రాజమహేంద్రవరం** అంగన్‌వాడీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే జగన్ ప్రభుత్వానికి పడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరంలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు ఆయన సంఘీభావం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలను గుర్రాలతో తొక్కించిన చంద్రబాబు పదేళ్లు ప్రతిపక్షంలో ఉండాల్సి వచ్చిందని. ఈరోజు కూడా ఆ ఘటనలు చంద్రబాబును వెంటాడుతున్నాయని గుర్తు చేశారు. 18 రోజులుగా అంగన్‌వాడీలు శాంతియుతంగా ఆందోళనలు సాగుతున్నా కళ్లుండి చూడలేని స్థితిలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. యూనియన్ ప్రతినిధులను చర్చలకు పిలుస్తున్న మంత్రులు బొత్స అంగన్‌వాడీలకు ఇస్తున్న వేతనాలపై అసత్యాలను చెబుతున్నారని మండిపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా జీతాలను ఇస్తున్నామని వాస్తవాలను వక్రీకరించేలా ప్రభుత్వం ప్రకటనలు చేస్తుందని మండిపడ్డారు. అంగన్‌వాడీల డిమాండ్లలో 8 డిమాండ్లను నెరవేర్చినట్లు మీడియాకు మంత్రి బొత్స సత్యనారాయణ అవాస్తవాలను చెప్పడం సరికాదన్నారు. శాంతియుతంగా పోరాటం సాగిందని, జగన్ అంగన్‌వాడీ సత్తా ఏంటో జగన్ రెడ్డి ప్రభుత్వానికి చూపిస్తామని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేబీరాణి హెచ్చరించారు. ఇప్పటి వరకూ ఎంతో సహనంతో ఉద్యమాన్ని చేశామని, జగన్ జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సివుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.మాణిక్యాంబ, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.రాజులోవ, ఐద్వా జిల్లా నాయకురాలు టి.సావిత్రి, సిఐటియు సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్, యూనియన్ నాయకులు అన్నపూర్ణ, కె.శారద, సునీత, రామలక్ష్మి, మరియమ్మ, స్రవంతి, మున్ని తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు రిలే నిరాహారదీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.దుర్గారావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.విజయకుమారి, కె.లక్ష్మి, కె.దయ యంతి, ఎ.శ్రీదేవి, ఎస్.అరుణ కుమారి పాల్గొన్నారు. **తాళ్లపూడి** స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాగు జ్యోతి, సుజాత, తదితరులు పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** పట్టణంలో జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరం వద్ద రిలే నిరాహారదీక్షలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.మాణిక్యాంబ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర బాబు పాల్గొని మాట్లాడారు. నాలుగు దఫాలు చర్చలకు పిలిచిన ప్రభుత్వం ఏ ఒక్క డిమాండ్‌ను పరిష్కరించకపోగా జగన్ నిర్బంధాలకు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌ను అంగన్‌వాడీలకు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయ కులు సిహెచ్ వివిఎల్.పుష్పావతి, బి.పద్మజ, ఎ.నరసమాంబ, వి.శ్రీదేవి, ఎస్.శాంతకుమారి, డి.అమరావతి, ఎంఎం.మహాలక్ష్మి, బి.అనంతలక్ష్మి, పాల్గొన్నారు. **గోకవరం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు రిలే నిరాహారదీక్షలను కొనసాగించారు. గత 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో ఏమాత్రం స్పందన రావడం లేదన్నారు. తూతూమంత్రంగా తమ సంఘం నాయకులతో చర్చలు జరిపినా ఏ ఒక్క డిమాండ్‌ను పరిష్కరించడం లేదన్నారు. ఇదే విధానంతో ప్రభుత్వం ముందుకు సాగితే తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వం లేని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మూల్యం అతి త్వరలోనే చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, యూనియన్ నాయకులు కె.లక్ష్మి కుమారి, ఎస్.రంగనాయకమ్మ, ఎం.జానకి, కెఎన్ఎస్.ప్రసన్నకుమారి, కె.విజయకుమారి, పుల్లరత్నం పాల్గొన్నారు. **దేవరపల్లి** స్థానికంగా జరుగుతున్న అంగన్ వాడీల రిలే నిరాహారదీక్షలను సిఐటియు నాయకులు కె.రత్నాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సమస్యను పరిష్కరించడానికి ఏమాత్రం చొరవ చూపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టిపి.లక్ష్మి, బి.సత్యవతి, పి.నాగలక్ష్మి, పి.నాగేశ్వరి, ఎస్.బేబీ, ఇందిరా, పి.సుజాత, పాల్గొన్నారు. **నల్లజర్ల** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఎరుపు రంగు రిబ్బన్లు ధరించి రిలే నిరాహారదీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కొక్కిరిపాటి వెంకట్రావు మాట్లాడుతూ అబద్దాల మాయలకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఆబద్దాలను కట్టిపెట్టి వాస్తవ పరిస్థితిని అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.విమలబాయి, ఎస్. రూప్లీలక్ష్మి, పి.రాజేశ్వరి, ఎస్.శివకుమారి, పి.జగదీశ్వరి, వై.బేబీ, ఐ.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టరేట్ వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల రిలే నిరాహారదీక్షలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్


ఉండ్రాజవరంలో అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి


గోకవరంలో రిలే నిరహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలు


కొవ్వూరులో అంగన్‌వాడీ నిరహారదీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు సుందరబాబు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి -నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని అచ్చన్నపాలెం 16వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలు...యలమంచిలి మండలం కొక్కిరాపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు భవానీ మాలధారులు విజయవాడ కనకదుర్గమ్మ గుడికి కాలినడకన బయలుదేరారు. ఈ నేపథ్యంలోనే నల్లజర్ల మండలం అచ్చన్నపాలెం గ్రామ సమీపంలో రోడ్డు ప్రక్కన మార్జిన్‌లో నడిచి వెళుతున్న వీరిని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గొర్లె నాని(28) అక్కడికక్కడే మృతి చెందగా, మోటూరి లక్ష్మణరావు, సుబర్ల లక్ష్మణరావు, గొర్లె అప్పం నాయుడు, గొర్లె శ్రీను తీవ్ర గాయాలపాలయ్యారు. గాయాలపాలైన వీరిని 108లో ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

బైకుపై వెళుతున్న ఇద్దరు యువకులు శుక్రవారం వికె.రాయపురం-మాధవపట్నం రోడ్డులో గోతుల్లో పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని అత్యవసర వైద్యం నిమిత్తం ప్రత్యేక వాహనంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాకినాడ సామర్లకోట ప్రయాణించే వాహనదారులు నిత్యం భారీ గుంతలలో పడి తీవ్ర గాయాలు పాలవుతుండగా, కొందరి ప్రాణాలు సైతం పోతున్నాయని ప్రయాణికులు, వాహనదారులు చెబుతున్నారు. ప్రభుత్వం కాకినాడ-సామర్లకోట రోడ్డుకు మోక్షం కలగజేయాలని పలువురు కోరుతన్నారు.

రెండు స్కూలు బస్సులు సీజ్

ప్రజాశక్తి-రౌతులపూడి

మూడేళ్ల నుంచి నిబంధనలు పాటించని రెండు స్కూల్ బస్సులపై కేసు నమోదు చేసి రూ.లక్షా 15 వేల జరిమానా విధించి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు జరిగిందని ఎంఇఒ బి.శ్రీనివాస్ తెలిపారు. మరో వాహనాన్ని తనిఖీ చేసి రూ.30 వేల ఫైన్ విధించి కేసు నమోదు చేశామన్నారు

కబేళాపై కేసు నమోదు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండల కేంద్రమైన జగ్గంపేట శివారు జె.కొత్తూరు రోడ్డులో నిర్వహిస్తున్న పశువుల కబేళాపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగార్జున రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాట్లగుంట వద్ద పశువుల కాబేళా నిర్వహిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేశామన్నారు. ఆ ప్రదేశంలో ఉన్న 6 పశువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కబేళా నిర్వాహకుడు పైడిమల్ల రాజు, సహాయకుడు కొత్తపల్లి రాంబాబుపై కేసు నమోదు చేశామన్నారు.

బస్సు, వ్యాన్ ఢీకొని పలువురికి గాయాలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం బండారులంక మాడ వారి సెంటర్ లో శుక్రవారం ఆర్‌టిసి బస్సు, ఐషర్ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అమలాపురం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న అల్ట్రా పల్లె వెలుగు బస్సు ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న కొంతమంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన వారికి ప్రథమ చికిత్స అందించారు. అమలాపురం తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం స్వాధీనం : నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి- తాళ్లరేవు

జాతీయ రహదారి 216పై తనిఖీలు నిర్వహిస్తుండగా కోరంగి పోలీసులకు 109 మద్యం బాటిళ్లతో నలుగురు వ్యక్తులు పట్టుబడినట్టు కోరంగి ఎస్ఐ రవికుమార్ తెలిపారు. అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన దాడి వినోద్, పెంటకోట హరీష్, మల్ల తేజ, వేగి సాయి ఒక కారులో రూ.50 వేల విలువైన 109 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా కాకినాడ రూరల్ సిఐ శ్రీనివాస్ ఇచ్చిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసినట్టు చెప్పారు. రూ.6 లక్షలు విలువ చేసే కారు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులను కాకినాడ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు తరలించారు. ఈ దాడుల్లో సిబ్బంది చిట్టిబాబు, సురేష్, సూర్యచంద్ర పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం దేశానికే గర్వకారణం

ప్రజాశక్తి - కడియం

ఉభయ గోదావరి జిల్లాల్లో రైతులు చేపట్టిన ప్రకృతి సేద్యం దేశానికే గర్వకారణం అని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జిడిఎస్ ఎన్‌జిఒ బృంద సభ్యులు అమితాబ్ మిశ్రా అన్నారు. పకృతి సేద్యం పై రెండు రోజులు పర్యటనలో భాగంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో యూపీ రాష్ట్రానికి చెందిన జిడిఎస్ ఎన్‌జిఒల బృందం ప్రతినిధులు సూర్య ప్రతాప్ సిన్హ, జయశంకర్ జోష్, భాస్కర్ సిన్హ, ఓం ప్రకాష్ రాయ్‌లు మండలం మురమండ గ్రామంలో రైతు ఆర్.సత్యనారాయణ చేపట్టిన పకృతి సేద్యంపై జిల్లా ప్రకృతి వ్యవసాయ పిడి బి తాతారావుతో కలిసిశుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రైతు సత్యనారాయణ పకృతి వ్యవసాయం కోసం వివరించారు. భూములో వాన పాములను కాపాడుకుంటూ ఉండాలని తెలిపారు. రసాయనికి ఎరువులతో పండించిన పంటలు కంటే మూడు బస్తాలు తక్కువ దిగుబడి మాత్రమే వస్తుందని, ఇటువంటి ప్రకృతి సేద్యం వలన ఖర్చు తక్కువ, రాబడి ఎక్కువ ఉంటుందన్నారు.


ప్రకృతి సేద్యాన్ని పరిశీలిస్తున్న యుపి రాష్ట్ర ఎన్‌జిఒ బృందం

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని ప్రక్కిలంక గ్రామ సచివాలయంలో శుక్రవారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి యాళ్ళ స్వప్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో మరోసారి జగన్‌ను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, నామా ప్రకాశం, పిట్టా శ్రీను, మండిగ గిరి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకుడు

దస్తావేజు పోయినవి

కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, సత్యదేవి నగర్ కాపురస్తులు రేవు సత్యం గారి కుమారుడు **రేవు ధర్మారావు** గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా ఆస్తికి సంబంధించి ది. **14-12-2020**వ తేదీన సవరణ దస్తావేజు నెం. **9669/2020**ను జెరాక్స్ తీసుకొను నిమిత్తం ది.22-12-2023న జగన్నాథపురం బ్రిడ్జి దగ్గర కోకిల రెస్టారెంట్ ఎదురుగా గల జెరాక్స్ షాపుకు తీసుకొని వెళ్ళుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. సదరు దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

రేవు ధర్మారావు
S/o. రేవు సత్యం, డో.నెం.51-1-12/1
సత్యదేవి నగర్, కాకినాడ, కాకినాడ అర్బన్ మండలం
సెల్: 9989591015

ఉదాసీనతతో రోడ్డు ఆక్రమణ

ప్రజాశక్తి - సీతానగరం

పంచాయతీ రోడ్డును రాళ్లత, మట్టితో ఆక్రమించారని చినకొండేపూడి గ్రామానికి చెందిన కోడెల్లి భాస్కరరావు శుక్రవారం ఎంపిడిఒ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. చినకొండేపూడిలో తన ఇంటి ఎదురుగా పంచాయతీ రోడ్డును తూర్పు వైపున చిడిపి మారియ్య కుమారుడు చిడిపి విజయబాబు, ముప్పిడి సుభాక రరావు ఆక్రమించి రాళ్లు, మట్టి వేశారని తెలిపారు. ఇది మా స్థలం, మా ఇష్టం వచ్చినట్లు వాడుకుం టామని నానా దుర్భాష లాడుతున్నారని వివరిం చారు. .

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, East Godavari Division

Short Tenders invited from contractors for NIT No. 171 to 182/2023-24, Dt: 29-12-2023 in 3 Districts (Kakinada, East Godavari & Konaseema) for Est. cost of Rs. 3.40 Lakhs to Rs. 18.36 Lakhs.
Last date for receipt of short tender notice Dt: 08-01-2024 upto 4.00 PM
Note: For further details can be viewed at https://tender.eprocurement.gov.in or contact 0884-2378457
Sd/- **B.RADHAKRISHNAIAH**
Executive Engineer, APEWIDC, Kakinada

గోపాలపురం ఎంపిడిఒ సస్పెన్షన్

ప్రజాశక్తి - గోపాలపురం




గోపాలపురం ఎంపిడిఒ ఆర్.శ్రీదేవిని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఆమె స్థానంలో ప్రస్తుతం గోపాలపురం ఇఒపిఆర్‌డిగా విధులు నిర్వహిస్తున్న బిఎస్ఎస్ శ్రీనివాస్‌ను ఫుల్ అడిషనల్ ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా ఉత్తర్వులు జారీ చేశారు.

బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని అచ్చుతాపురం గ్రామంలో తుపాన్ ప్రభావంతో కూలిపోయిన ఇంటికి నష్ట పరిహారంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేలను బాధిత కుటుంబానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ బత్తుల వెంకట రామకృష్ణ అందించారు. ఎంపిటిసి భ్యులు కొత్తపల్లి చిన్నబాబు, వైసిపి నాయకులతో కలిసి నష్ట పరిహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, భీమరాజు, నల్లల బుజ్జి, సాయి, మాగాపు వెంకటరమణ, జాజులు వర్మ పాల్గొన్నారు.


ప్రభుత్వ నష్ట పరిహారాన్ని అందిస్తున్న సర్పంచ్ వెంకట రామకృష్ణ

హాలో - 2024 పేరిట న్యూ ఇయర్ వేడుకలు

ప్రజాశక్తి- యానాం

పుదుచ్చేరి పర్యటకశాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 31వ తేదీన హాలో-2024 పేరిట న్యూ ఇయర్ వేడుకలును స్థానిక సీగల్స్ రెస్టారెంట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. ఆదివారం రాత్రి పెద్దలకు, పిల్లలకు, యువకులకు లైవ్ మ్యూజిక్, డిజె డాన్స్ షోలు, ఆర్కెస్ట్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు భారీ బాణాసంచాతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నట్టు తెలిపారు. రూ.500 ఎంట్రీ ఫీజుగా నిర్ణయించినట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు సీగల్స్ రెస్టారెంట్ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

వికలాంగుల పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

స్థానిక బీచ్ రోడ్‌లో ఉన్న మానసిక వికలాంగుల పాఠశాలను పుదుచ్చేరి డిపార్ట్మెం ట్ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ డైరెక్టర్ ముత్తు మీనా శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలపై ప్రిన్సిపల్ ఎస్ఎ. నాయుడును అడిగి తెలుసుకున్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి మానసిక వికలాంగులకు ప్రత్యేక వసతులు సమకూర్చి, విద్యను అందిస్తున్న విధానంపై అభినందించారు. అనంతరం కొంత సమయం పాటు పిల్లలతో ముచ్చటించారు. తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ మేరీ, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మానసిక వికలాంగులతో డైరెక్టర్ ముత్తు మీనా

నష్టపరిహారం త్వరగా చెల్లించాలి

ప్రజాశక్తి - యానాం

యానాం మత్స్యకారులకు ఒఎన్‌జిసి సంస్థ నుంచి రావాల్సిన వేట నష్టపరిహారం త్వరగా చెల్లించాలని ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్.మునిస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం కాకినాడలో ఒఎన్జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్ కుమార్‌ను కలిసి పరిహారంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.గొంతియ్య పాల్గొన్నారు.


ఒఎన్‌జిసి ఇడితో మాట్లాడుతున్న మునిస్వామి

అర్జునరావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - యానాం

స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో ట్యాంక్ ఆపరేటర్ నుండి బిల్ కలెక్టర్‌గా 40 ఏళ్ల పాటు సేవలందించిన కుంచనపల్లి అర్జున్‌రావు ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా పలువురు శుక్రవారం ఆయనను అభినందించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రగాశం, మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

భరత్ అంటేనే అవినీతి : మణేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అవినీతంటేనే ఎంపి మార్గాని భరత్ రామ్... భరత్ రామ్ అంటేనే అవినీతి అనే బిరుదును రాజమహేంద్రవరం నగర ప్రజలే ఇచ్చారని, ఈ నాలుగున్నరేళ్లల్లో అంతటి అవినీతి కీర్తిని భరత్ రామ్ మూటగట్టుకున్నాడని టిడిపి నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, జనసేన పార్టీ నగర ఉపాధ్యక్షులు గుత్తుల సత్యనారాయణ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈడీ కేసులు, ఆస్తుల అటాచ్‌మెంట్‌లో ఉన్న జగన్ గజదొంగ అనే పదానికి సరిగ్గా సరిపోతాడన్నారు. ఆవ భూముల్లో ఎంపి భరత్ రామ్ అవినీతి చేశారంటూ వారి పార్టీ ఎంఎల్ఏ జక్కంపూడి రాజా ఆరోపణలు చేయడం నిజం కాదంటారా? అని ప్రశ్నించారు. వెన్నుపోటు రాజకీయాలకు కేంద్ర బిందువు వైసిపి అని, అందులో ముఖ్య పాత్రధారి ఎంపి భరత్ రామ్ అని అన్నారు. గతంలో రౌతు సూర్యప్రకాశరావుకు వెన్నుపోటు పోడిచి ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో ఆయన్ను అక్కున చేర్చుకుని ఓట్లు కోసం రుడా ఛైర్మన్ పదవి ఇచ్చారని దుయ్యబట్టారు. రుడా ఛైర్‌పర్సన్ పదవి కోసం అప్పటికే జివో తెచ్చుకున్న మేడపాటి షర్మిల రెడ్డిని వారి పార్టీ అధిష్టానం వద్ద చర్చలు జరిపి పక్కకు తప్పించింది నిజం కాదా...? అది వెన్ను కాదా అని ప్రశ్నించారు. ఆదిరెడ్డి కుటుంబం పదవులకే కానీ అభివృద్ధి చేయడం లేదని అడపా శ్రీహరి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 20 ఏళ్ల పాటు టిడిపి నగర అధ్యక్షుడిగా ఆదిరెడ్డి అప్పారావు పని చేసిన సమయంలో నగరంలోని ప్రతి సమస్యపై పోరాడి పరిష్కారం చూపించారని, ఆ గౌరవంతోనే ఆదిరెడ్డి వీరరాఘవమ్మకు నగర ప్రజలు మేయర్‌గాను, వారి కోడలు ఆదిరెడ్డి భవానీగా ఎంఎల్‌ఏగా గెలిపించి ప్రజలు గౌరవం ఇచ్చారని అన్నారు. అభివద్ధి అంటే బొమ్మలు పెట్టడం, యాపిల్ పెట్టడం, గోడలకు, రోడ్లకు బిల్లలు అంటించడం కాదని, చేసిన ఆ పనులు కూడా చాలా నాశికరంగా చేయడంతో మూనాళ్లకే పెచ్చులూడుతున్నాయని నగర ప్రజలు గ్రహిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టిడిపి మాజీ కార్పొరేటర్లు రాచపల్లి ప్రసాద్, కోరుమిల్లి విజయశేఖర్, తంగెళ్ల బాబీ, ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి బొర్రా చిన్ని, ఉపాధ్యక్షులు రాయి అప్పన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

హరియల సిద్ధార్థ, వయస్సు 36 సం॥లు, S/o. హరియల విజయ కుమార్, అను నేను డో.నెంయ.3-136, చీడిగ గ్రామం, కాకినాడలో నివశించుచున్నాను.

నా తల్లిదండ్రులు ఇరువురు హిందువులు. నేను బౌద్ధమతమునకు వ్యక్తిగతంగా ఆకర్షింపబడినందున, నేను స్వచ్ఛందంగా ది.19-03-2023 తేదీన The Buddhist Society of India, Mumbai-14 వారి బ్రాంచి మంగళగిరి, ఆంధ్ర ప్రదేశ్ నందు శ్రీ బేతాళ సుదర్శనం గారి ఆధ్వర్యంలో బౌద్ధ మతమును స్వీకరించి యున్నాను. సభ్యత్వ నెం.92207.

కావున ది.19-03-2023 నుండి నన్ను నేను Buddhistగా ప్రకటించుచున్నాను. ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయముగా తెలియజేయడమైనది.

హరియల సిద్ధార్థ
డో.నెం.3-136, చీడిగ గ్రామం, కాకినాడ
సెల్: 8897286997

నోటీసు

మహారాజశ్రీ రామచంద్రపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A. 49/2023 in O.S. 51/2023

Between :
మాధవరపు సాంబశివరావు,
S/o. సత్యనారాయణ, 42 సం॥లు, హిందూ, కేబుల్ వ్యాపారం మరియు వ్యవసాయం, R/o. డో.నెం. 10-16, నున్నవారి వీధి, ద్రాక్షారామ గ్రామం, రామచంద్రపురం మండలం, రామచంద్రపురం J.C.J.C. ...పిటీషనర్ / వాది

మరియు

దిద్దే ఆశలత, W/o. సుధాకర్, 42 సం॥లు, హిందూ, వ్యాపారం, R/o. డో.నెం. 69-6-16, కొత్త గైగోలుపాడు ఏరియా, చర్చివీధి, కాకినాడ, కాకినాడ జిల్లా, కాకినాడ J.C.J.C. ...రెస్పాండెంట్ / ప్రతివాది

పై నెంబర్ పిటీషన్ నందు రెస్పాండెంట్ హాజరు నిమిత్తం **ది. 03-01-2024** వాయిదా అయ్యి ఉన్నది. కావున మీరు ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు కాబడి మీ సంజాయిషీని తెలియజేసుకోవలెను. లేనిచో సదరు పిటీషన్‌ను మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియచేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి //

కముజు సూర్యనారాయణ
పిటీషనర్ తరపు అడ్వకేట్
రామచంద్రపురం. సెల్: 98493 79828
డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.
తేది: 29-12-2023

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో
D.O.P. No. 6/2019

Between :
కె.యస్.యస్.యస్. రూపాదేవి
W/o. రాజకుమార్, వయస్సు 35 సం॥లు గృహిణి, గైగోలుపాడు గ్రామం, కాకినాడ రూరల్ మండలం. ...పిటీషనర్

మరియు

కె. రాజకుమార్
S/o. చినతాతాయ్య, వయస్సు 43 సం॥లు, సీతయ్యగారితోట, పిఠాపురం....రెస్పాండెంట్

పై నెంబరు OPలో పిటీషనర్ విడాకుల కొరకు రెస్పాండెంట్‌పై పిటీషను దాఖలు చేసిన వాజ్యములో రెస్పాండెంట్ నోటీసులు, సమన్లు తీసుకొనకుండా ఉన్నందున దానిపై శ్రీ కోర్టువారి ఆదేశములమేరకు సదరు పై నెంబరు కేసు **ది.వి. 04-01-2024 సం॥ తేదీన ఉదయం 10 గంటలకు** స్వయంగా గానీ, వకీలు గారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు తెలుపని యెడల మీ పరోక్షంలో తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

అవసరాల నాగరాజు, B.Sc., B.L.
పిటీషనర్ తరపు అడ్వకేట్
డో.నెం. 8-13-9/23, Srya బిల్డింగ్
ప్రతాప్‌నగర్, కాకినాడ-4
కాకినాడ.
ది.19-10-2023
సెల్: 99128 41155

ప్రకటన

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో: పిఠాపురం
E.A. 204/2023; E.P. 38/2021; O.S. 152/2010

Between:
జొన్నలగడ్డ వెంకట జగదీశ్వరి
...పిటీషనర్ / డి.హెచ్.ఆర్

మరియు

గంటా మంగయ్యమ్మ మరియు ఇతరులు
...జె.డి.ఆర్స్ 2 నుండి 6గా చేర్చవలసినవారు / రెస్పాండెంట్స్

రెస్పాండెంట్స్ 3, 5 మరియు 6:
3) గంటా మంగయ్యమ్మ, భర్త: (లేటు) ఏడుకొండలు, వయస్సు 60 సం॥లు, హిందూ, గృహిణి, కొత్తూరు గ్రామం, H/o. హంసవరం, తుని మండలం, Tuni PJCJC Limits.
5) గంటా ఏడుకొండలు, తండ్రి: (లేటు) ఏడుకొండలు, వయస్సు 36 సం॥లు, హిందూ, వ్యవసాయం, కొత్తూరు గ్రామం, H/o. హంసవరం, తుని మండలం, Tuni PJCJC Limits.
6) పడికల్లు దుర్గ, తండ్రి: (లేటు) ఏడుకొండలు, హిందూ, గృహిణి, కొత్తూరు గ్రామం, H/o. హంసవరం, తుని మండలం, Tuni PJCJC Limits.

పై ఇ.ఎ.లో 3, 5 మరియు 6 రెస్పాండెంట్లు అయిన మీకు, మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు **ది. 04-01-2024 తేదీకి** వాయిదా వేసియున్నారు. కావున సదరు దావాలో మీరు స్వయముగా లేదా న్యాయవాదుల ద్వారా పై కోర్టువారి ఎదుట **ది. 04-01-2024వ సం॥రం తేదీని ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా: 04-01-2024

మేరుగు రాజారావు, సి.హెచ్. రమణి
అడ్వకేట్స్, పిఠాపురం.
పిఠాపురం.
ది.29-12-2023
సెల్: 9440522671

నోటీసు

మహారాజశ్రీ రామచంద్రపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S. No. 51/2023

Between :
మాధవరపు సాంబశివరావు,
S/o. సత్యనారాయణ, 42 సం॥లు, హిందూ, కేబుల్ వ్యాపారం మరియు వ్యవసాయం, R/o. డో.నెం. 10-16, నున్నవారి వీధి, ద్రాక్షారామ గ్రామం, రామచంద్రపురం మండలం, రామచంద్రపురం J.C.J.C. ...వాది

మరియు

దిద్దే ఆశలత, W/o. సుధాకర్, 42 సం॥లు, హిందూ, వ్యాపారం, R/o. డో.నెం. 69-6-16, కొత్త గైగోలుపాడు ఏరియా, చర్చివీధి, కాకినాడ, కాకినాడ జిల్లా, కాకినాడ J.C.J.C. ...ప్రతివాది

పై నెంబర్ దావా నందు ప్రతివాది హాజరు నిమిత్తం **ది. 03-01-2024** వాయిదా అయ్యి ఉన్నది. కావున మీరు ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు కాబడి మీ సంజాయిషీని తెలియజేసుకోవలెను. లేనిచో సదరు దావాను మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియచేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి //

కముజు సూర్యనారాయణ
వాది తరపు అడ్వకేట్
రామచంద్రపురం. సెల్: 98493 79828
డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.
తేది: 29-12-2023

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో : పిఠాపురం
I.P. No. 5/2023

Between:
NANDIKA LAKSHMI ...Petitioner
and
ANANTHAPU AMMAJI & 5 OTHERS ...Respondents

To,
R2 : Geddam Veerababu, S/o. China Pallayya, Kotananduru (V), Kakinada District.
R3 : Tanivelu Suribabu, S/o. Not Known, Kotananduru (V), Kakinada District.
R4 : Sadrem Annamayya, S/o. (Late) Adinarayana, D.No. 55-14-98, Simhadripuram, HB Colony, Visakhapatnam.
R5 : Rajolu Appala Raju, S/o. Tavitayya, D.No. 48-92-26, Ashok Nagar, Akkayyapalem, Visakhapatnam.
R6 : Yena Rambabu, S/o. Ramayya, D.No. 39-20-44/39, Madhavadhara, Vuda Quarters, Visakhapatnam.

పై వాజ్యములో మీరు 2, 3, 4, 5 మరియు 6వ ప్రతివాదులు అయి ఉన్నారు. పై కోర్టువారు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపియున్ననూ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు అందజేయు నిమిత్తం ఆర్డర్ వేసియున్నారు. కావున మీరు **ది. 11-01-2024వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు ఎదుట మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు తెలియజేసుకోవలెను. అట్లు కాని యెడల సదరు వాజ్యముపై మీకు పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులమేరకు //

పడాల రవి, అడ్వకేట్
డో.నెం. 1-5-10, ఎమ్.ఆర్. పేట,
పిఠాపురం, సెల్: 9848011614
పిఠాపురం
ది.25-12-2023